


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

50

"**యజ్ఞప్పగారూ**, పరమేశ్వరశాస్త్రిగారూ మీరు వచ్చినందుకు చాలా సంతోషం. ఇంతకాలం నాతోబాటు మౌనంగా పూజలు ధ్యానము యోగసాధన చేసినందుకు ధన్యవాదాలు. ఒక బండరాయిని ఎత్తి కొండ శిఖరం మీద నిలపటం చాలా చాలా చాలా కష్టం. ఒక్కోసారి ఆ ప్రయత్నంలో కాలు జారి ప్రాణాలే పోవచ్చు. చిత్రం ఏమంటే, ఆ శిఖరం మీదనించి ఆ బండరాయిని కిందకి తోసెయ్యడానికి క్షణం పట్టదు. అలాగే మీరూ, మీరు చెప్పిన అందరూ, మీతోపాటు చేస్తున్న ప్రయత్నమే ప్రళయమనే బండరాయిని లోకం నించి దూరంగా పెట్టాలని. ఎంతవరకూ శ్రమ ఫలించిందో మనకి తెలియదు. ఎందుకంటే ఆ శ్రమ మనకు మాత్రమే. ప్రళయాన్ని ఆపాలనే ఆత్రం మాత్రమే. నిష్కల్మషమూ నిస్వార్ధమూ అయిన ప్రార్ధనకి ఉండే శక్తి అనంతం. ఒక్కటి నిజం. భగవంతుడి సృష్టి ఎప్పుడూ సంపూర్ణంగా నాశనం కాదు. ఏదో ఓ రూపంలో తనని తానే పునరిద్ధరించుకుంటుంది" ఆగారు నిశ్చలానంద. మదాలసతో సహా అందరూ వింటున్నారు.

"ఒకటి మాత్రం నిజం, ప్రేమ, పగ, ద్వేషం, అసూయ, జాలి, దయ, మదం, మాత్సర్యం, ఈర్ష్య ఇవన్నీ మానవ సంకల్పాలే. సంకల్పాలే మరోవిధంగా మానవాకృతిని దాలుస్తాయి. అబ్బా మనిషిలాంటి యంత్రాన్ని సృష్టించాలని సంకల్పిస్తాడు. ఖచ్చితంగా సృష్టిస్తాడు. పక్షుల్ని చూసి గాలిలో ఎగరాలని విమానాన్ని సృష్టించలేదూ! సముద్రంలో చేపల్లా

తిరుగాడాలని ఓడల్ని తయారు చెయ్యలేదూ! విద్యుత్తుని ఉపయోగించి ఎంత సృష్టి చేశాడు మానవుడు. లెక్కలు గట్టే కాసా రేపర్లనేకాదు ఇవ్వాళ కంప్యూటర్లు, రోబోలు, శేటిలైట్లు, రాకెట్లు, గ్రహాంతరాలకి వెళ్ళే వాహనాలు ఎన్ని సృష్టించలేదూ? ఇవన్నీ సృష్టించబడ్డవి మానవ మనో సంకల్పం వల్లనే. భూగోళాన్ని నాశనం చేసే అణ్వస్త్రాలూ, బాంబులూ, క్షిపణులూ ఇవీ మానవ సంకల్పంలోంచేగా పుట్టింది" మళ్ళీ ఆగారు సంకల్పానంద.

"అవును అన్నీ సంకల్ప జనితాలే. నేటి సంకల్పమే రేపు సజీవమై మనముందు నిలుస్తుంది. ఒక్క 'అగ్గిపెట్టె' సృష్టి ఎంత గొప్పదీ! చెకుముకి రాళ్ళనించే వస్తోంది. అదీ లెక్కపెట్టలేనంతగా. ఏమో ఒక అవతారం అవతరించాలంటే కొన్ని వేల సంవత్సరాలు, ఒక్కోసారి లక్ష సంవత్సరాలు కుడా పడుతుంది. అయితే ఆ అవతారానికి మూలం అనంతమైన తపఃశ్శక్తి" అన్నారు యజ్ఞప్ప.

"నిజం. అనంతమైన తపఃశ్శక్తి అనంత శక్తి మూర్తీభవించడానికి కారణమవుతుంది. సత్యయుగా (కృతయుగం)నికి సత్యానికి పరిక సత్యానికి జరిగింది. త్రేతాయుగ పరిక్ష శాంతి అశాంతి మధ్య జరిగింది. దాన్నే న్యాయాన్యాయాల మధ్య పోరాటం అనుకుంటే, ద్వాపర యుగంలో ధర్మాధర్మాల మధ్య పోరాటం జరిగింది. సత్యము, న్యాయము, ధర్మము గెలిచిన మాట నిజమే. కానీ ఎప్పుడు? చెప్పలేనంత, ఊహించలేనంత ధ్వంస రచన జరిగిన తరువాత మాత్రమే" ఆగారు సంకల్పానంద. అందరూ వింటున్నారు.

"ఇది కలికాలం. ఇప్పుడు జరుగుతున్నది ఒక అంశం మీద యుద్ధం కాదు. సత్యమూ, ధర్మమూ,న్యాయమూ, శాంతీ కూడా అంత్యావస్థకి చేరుకున్నాయి. దేనిమీద పోరాడాలీ? ఎక్కడ చూసినా అన్యాయమే, అధర్మమే, అశాంతే రాజ్యమేలుతున్నాయి. వీటినించి న్యాయాన్నీ, ధర్మాన్నీ శాంతినీ రక్షించేది ఎవరూ? ద్వాపరంలో ప్రభవించినట్లు కృష్ణుడు ప్రభవించాలి" ఆగారు సంకల్పానంద.

"అలా జరగాలంటే కర్మ పరిపక్వమవ్వాలి. ఎందుకంటే రెండూ బలీయమైన శక్తులే. న్యాయ, ధర్మ, సత్య, శాంతుల పక్షాన ఎంతమంది నిలబడతారో, అంతకన్నా ఎక్కువమందే అధర్మ అసత్య అశాంత అన్యాయం వైపు నిలబడతారు. ఉదాహరణ కురుక్షేత్రమే! అడ్డదారిలో సర్వసౌఖ్యాలూ లభించేటప్పుడు రుజు మార్గంలో ఎవరు నడుస్తారలా?" అన్నారు పరమేశ్వర శాస్త్రి.

అందరూ నిశబ్దంగా కూర్చున్నారు. ఎవరి మనసులో ఆలోచనలు వారివి. మదాలస మాత్రం అమ్మవారి వంక చూస్తోంది.

"అమ్మా.. కొన్ని దశాబ్దాలుగా గుడిని నిర్లక్ష్యం చేశారు. అమ్మవారిని ధూపదీప నైవేద్యాలతో అర్చించడం మానేశారు. అమ్మవారి కృపవల్లే, అమ్మవారి సంకల్పం వల్లే మళ్ళీ అమ్మవారికి సేవలు మొదలయ్యాయి. ఈసారి మాత్రం పూజాది కార్యక్రతువులు ఆగడానికి వీల్లేదు. ప్రళయాన్ని గురించి ఆలోచిస్తూ, అమ్మవారి గురించి ఆలోచించడం మానవద్దు. ప్రళయం చీకటి అయితే, అమ్మవారి కృప వెలుగులాంటిది. ఆ వెలుగుని పోగొట్టుకోకూడదు" అన్నారు సంకల్పానంద మదాలస చూపుని గమనించి. అందరూ అమ్మవారి వంక చూశారు. ఆవిడ చిన్నగా నవ్వినట్లు అందరికీ అనిపించింది.

"అవును కోటానుకోట్ల జీవులున్నాయి. అన్ని జీవుల్నీ బ్రతికించేదీ, పోషించేదీ, లయింప చేసేదీ ఒకేశక్తి. దాహం అయినప్పుడు నీటిని ఆశ్రయించినట్లు, నిరాశ నిస్పృహ, ఆవరించినప్పుడు మనం ఆశ్రయించాల్సింది దైవశక్తినే. ఆ దైవ శక్తి ఎక్కడో లేదు. అదీ మనలోనే ఉంది. అంటే మన సంకల్పంలోనే ఉంటుంది. సత్సంకల్పమే మనని ఒడ్డుకు చేర్చే శక్తి. ఇంతకుముందు కొన్ని వందల మంది మహాపురుషులు యోగులు తమ మనోశక్తినీ, తపశ్శక్తినీ యీ అమ్మవారి పాదాల కడ నిక్షిప్తం చేశారు. ఆ శక్తికి మనం ప్రస్తుతానికి చేసింది పునఃప్రాణ ప్రతిష్ట మాత్రమే. అసలైన పని మొదలయ్యేది ఇప్పటినించే" అందరి వంకా చూసి అన్నాడు నిశ్చలానంద.

పక్షులు గూళ్ళకి చేరుకుంటున్నాయి. నిశాచరజీవులు నిద్రనించి మేల్కొని ఒళ్ళు విరుచుకుంటున్నాయి. నిశ్చిలానంద వద్దనే ఉన్న నీలుడు మట్టూ తదితరుల దివిటీలు వెలిగించే పనిలో నిమగ్నమయ్యారు. ఓ వితంతువు శ్రద్ధగా వంట పనులు పూర్తి చేసింది. ఆ రోజే ఆలయానికి వచ్చిన కొందరు సందర్శకులు అమ్మవారి ఎదుట లలితా సహస్రనామాల్ని వీనులవిందుగా పఠిస్తున్నారు. గుడిమండపంలో కొందరు వారి కోసం రాళ్ళ పొయ్యి మీద వంటలు చేస్తున్నారు. సాయం సంధ్య చిక్కబడి చీకటి తెరల్ని తెరుస్తున్నది. అడవి మొక్కల వేళ్ళని ఎండబెట్టి వెలిగించిన పుల్లలు అద్భుతమైన సువాసనల్ని అగరువత్తుల్లా విరజిమ్ముతున్నాయి. ఆలయ ఆవరణలో ఉన్నజీవులు కొన్ని తీరిగ్గా నెమరువేస్తున్నాయి. వాటికి ఆనుకుని దూడలు ప్రేమగా తల్లుల శరీరాల్ని తలతో కుమ్ముతున్నట్టుగా ఆడుకుంటున్నాయి. నగరంలో దీపాలు వెలిసినట్టు ఒక్కో నక్షత్రమూ ఆకాశంలో మొలకల్లాగామెరుస్తూ 'నారు' పరాటగా కూరినట్టు ఆకాశాన్ని ఆత్రంగా కప్పేశాయి. క్షణాల్లోనే లక్షలాది నక్షత్రాలు దేదీప్యమానంగా వెలిగే పాలపుంత.

"ఆ పాలపుంత అచ్చు అమ్మవారి పాపిటలాగా ఉన్నది కదూ!" కళ్ళు విప్పి ఆకాశాన్ని ఆనందంగా చూస్తూ అన్నది మదాలస.

"అవునమ్మా.. ఈ విశ్వమే అమ్మవారి శరీరం.." దీవిస్తున్నట్టుగా చూస్తూ అన్నాడు నిశ్చలానంద.

"వడ్డించమంటారా?" అడిగింది ఎంతో సున్నితంగా ఆ వితంతువు. అందరూ భోజనానికిలేచారు. ఆ సరికి సహస్ర పారాయణ కూడా పూర్తి అయింది.

"దుస్తులు మారినా శరీరం మారనట్లు, శరీరాలు మారినా మనసులు మారవు. శరీరాన్ని విడిచి విశ్వాంతరాళంలో కలిసిన మనసు (లేక ఆత్మ) మళ్ళీ మరో శరీరాన్ని తొడుక్కుని అవ్యక్తం నించి వ్యక్తి స్థితికి వస్తుంది. అందుకే హింసాత్మక మనస్సులు మళ్ళీ మళ్ళీ హింసాపూరిత మనసులోనే కొనసాగుతాయి." అన్నాడు అలంబసుడు. (ఇతడు ఘటోత్కచ ఇరావంతులకు సమ ఉజ్జీ. సాత్యకితో, అభిమన్యునితో పోరాడి ఓడినవాడు – ద్వాపర యుగ జన్మలో. చివరికి ఘటోత్కచుని చేతిలో మరణించినవాడు. ఈ జన్మలో అతని తండ్రి నరసింహ భరద్వాజ అయితే ద్వాపర యుగంలో ఇతని తండ్రి పేరు రుష్య శృంగుడు).

"ఊ...! అందుకే మన స్థితి డోలాయమానంగా ఉందన్నమాట. అయినా, అలంబసా, ఆత్మా మనసూ ఒకటే ఎలా అవుతాయి?" అడిగాడు అరిదమనుడు.

"బుద్ధి జ్ఞానం ఆత్మ మనసు అన్నీ ఒకే శక్తికి ఉన్న వివిధ కోణాలు. ఒకే చెట్టుకి ఉన్న వేళ్ళు, కాండం, కొమ్మలు, రెమ్మలు పువ్వులూ కాయలు ఫలాల్లాగా" స్పష్టంగా అన్నాడు అలంబసుడు.

"ఇక రెండో ప్రశ్న.. నా మనసు డోలాయమానంగానే ఉంది. ఆ జన్మలోనూ యీ జన్మలోనూ నా తండ్రులు సాత్వికులు. సంప్రదాయాల్ని పాటించే సాంప్రదాయకులు. మరి నాకీ హింసా ప్రవృత్తి ఎలా వచ్చిందో తెలీదు. బ్రాహ్మణుడినే. బ్రాహ్మణ వస్త్రధారినే. కానీ నా మనసు నిరంతరం ఆలోచించేది విధ్వంసం వైపు. అందుకే అరిదమనా, నేను స్పష్టంగా చెప్పగలను.. యుగాలు మారినా మనో ప్రవృత్తులు మారవని" సుదీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు అలంబసుడు.

"ఇప్పుడు ఏం చేద్దామని? అసలు నీ ఆలోచన ఏమిటీ?" అడిగాడు అరిదమనుడు.

"నిజంగా నాకే అర్థంకావడంలేదు. కాలానికి సర్వం లోబడి  ఉండాల్సింది. నా మనసులో ఒకవైపు విచ్ఛిన్నకర శక్తులు వికటాట్టహాసం చేస్తూంటే, మరోవైపు 'ఇప్పటికైనా నీ మనఃప్రవృత్తి మార్చుకో' అని అంతరాత్మ అంటున్నది అరిదమనా.. నా మనసు అంతరాత్మని అతిక్రమిస్తోంది. అందుకే నువ్వు నన్ను అమ్మవారి ఆలయానికి రమ్మంటున్నా నేను రాలేకపోతున్నాను. కారణం, నా మనసు ద్వైదీభావంతో నరకయాతన అనుభవిస్తోంది" నిట్టూర్చి అన్నాడు అలంబసుడు.

"అప్పటి పగ అప్పటి పరాభవం అప్పటి అహంకారం ఇప్పటికీ అలానే ఉన్నాయి. అసలు కురుక్షేత్ర సంగ్రామనికీ నాకూ ఏం సంబంధం? అన్నదమ్ముల ప్రతీకారాలు మధ్య జరిగిన పోరులో 18 అక్షహిణీళ సైన్యం సర్వనాశనమవడమా? పోనీ గెలిచిందెవరు? ఏం గెలిచారు? కళేబరాల్ని గెలిచారా కన్నీళ్ళని గెలిచారా? సరేనయ్యా.. బుద్ధిలేకనో, ఉన్న బుద్ధి

నిద్రావస్థలో ఉండటం వల్లనో కౌరవుల పక్షాన చేరాను. ఎందువల్ల? నాలో ఉన్న హింసాత్మక ప్రవృత్తివల్ల. అప్పటికది ఉన్నదని నాకు తెలీదు. అప్పటికే, అంటే ద్వాపరయుగంలోనే నా మనఃప్రవృత్తి అట్లా ఉందంటే, రామాయణ కాలంలో అంటే, త్రేతాయుగంలోనూ అలాగే ఉండి ఉండాలి. ఆ యుగంలో నేను రావణుడి పక్షం వహించి ఉండాలి" కణతలు నొక్కుకుని అన్నాడు అలంబసుడు."

"నీ ఆలోచన మరీ లోతుగా ఉంది. అలంబసా.. సర్వమూ జరిగేది ఓ మనో చైతన్యపు సంకల్పంతోనే. ఒకడు మంచివాడుగా ఉండటానికీ, ఒకడు చెడ్డవాడిగా ఉండటానికీ కూడా కారణం ఆ మహా చైతన్య శక్తే. మనం ఆ శక్తి చేతిలోని పనిముట్టులాంటి వాళ్ళం. గతాన్ని గురించి ఆలోచిస్తూ వర్తమానాన్నీ, భవిష్యత్తునీ వ్యర్థం చెయ్యకు. నీలో ఓ అద్భుత శక్తి లేకపోతే ఆలయంలో మహా యజ్ఞాన్ని నివృత్తి యజ్ఞాన్నీ ఎలా చెయ్యగలిగావూ? ఆలోచనలు పంజరాల్లాంటివి. వాటిని ముందు సక్రమ మార్గంలోకి నడిపించు" అనునయంగా అన్నాడు అరిదమనుడు.

"అరిదమనా నా ప్రయత్నం అదే. సాధనవల్ల కొన్ని ఆలోచనలు మారుతాయి. విచక్షణ వల్ల స్వభావమూ కొంత మారుతుంది. కానీ పులికి పంజాల్లా, పాముకి కోరల్లా మొసలికి దంతాల్లా, గద్దకి చూపులా వచ్చిన సహజ లక్షణాలు, అంటే జన్మతః వచ్చిన లక్షణాలు అంత తేలికగా మారవు. శరీరాలు మారినా జన్మ లక్షణాలు మారవు. మారాలంటే, ఏ శక్తి వ్యక్తినీ, వ్యక్తిత్వాన్నీ సృష్టించిందో, ఆ శక్తి మాత్రమే మార్చగలదు. అందుకనే నీవంటి సజ్జనుడి స్నేహం లభించింది. నీ స్నేహం లేకపోతే ఆలయానికి వచ్చే అవకాశమే ఉండేది కాదుగదా! ఏమో? మారే సమయం వచ్చిందేమో!" అన్నాడు అలంబసుడు. దూరాన ఓ పిట్ట ఘనంగా కూసింది. ఆ కూత మంచి శకునం అని అలంబసుడికి అనిపిస్తే అపశకునంగా అరిదమనుడికి అనిపించింది.

"అరిదమనా... రామాయణకాలంనుంచీ మళ్ళీ మళ్ళీ జన్మనెత్తుతూ మళ్ళీ మళ్ళీ హింసకి పాల్పడుతూ వస్తున్నది నేనొక్కడినే కాదనిపిస్తోంది. ఎందరో మళ్ళీ మళ్ళీ ఈపాటికి జన్మించే ఉండాలి. అరిదమనా... ప్రతి ప్రళయమూ మరో సనాతన సృష్టికి పునాది అవుతుంది. ప్రతి జననమూ ఒక మరణానికి హేతువవుతుంది. ప్రతి నిశ్వాసా మరో శ్వాసకి ఆధారమవుతుంది. నువ్వు అన్నదే నిజం. మంచి చెడుల జంఝాటం నాకెందుకూ ఇదిగో యీ 'క్షిప్రా' నది సాక్షిగా నావంతు కర్తవ్యం ఏదో నేనది నిర్వర్తిస్తాను" అన్నాడు అల్బసుడు.

వారున్నది ఉజ్జయినిలో.. క్షిప్రానది ఒడ్డున. ఆ పొద్దున్నే వారు మహాకాళేశ్వర దర్శనం చేసుకున్నారు.భస్మ హారతిని కళ్ళారా వీక్షించారు. అయితే వారిద్దరి కలయక ఉజ్జయినిలో కాకతాళీయంగా జరిగిందేకానీ, కావాలని వారు నిర్ణయించలేదు.

"నేను మాట్లాడవచ్చా? ఇందాకటి నించీ మీ మాటలు విన్నాను" నవ్వుతూ వారి ముందరకొచ్చాదు ఓ త్రిశూలధారి. తలంతా జడలు కట్టి వుంది.

"చెప్పండి" సగం సందేహంతో సగం విస్మయంతో అన్నాడు అరిదమనుడు.

"ఇద్దరు మాట్లాడుకునేటప్పుడు మూడోవారు ఆ ఇద్దరి అనుమతి లేకుండా వినడం ప్రథమ తప్పిదం. 'నేను మాట్లాడవచ్చా?' అని చర్చలో పాల్గొనబోవడం మరో తప్పిదం" కోపంగా అన్నాడు అలంబసుడు.

ఆ మాట విని అలంబసుని మందలించబోయాడు అరిదమనుడు. పకపకా నవ్వి అరిదమనుడిని ఆపడు త్రిశూలధారి.

"అయ్యా.. వారన్నదాంట్లో ఏ తప్పూలేదు. నేను చేసిన రెండూ తప్పులే. కానీ, కావాలని మీ మాటలు నేను వినలేదు. అసలు యీ పక్కకి రావడమే నా ఆలోచనలో లేదు. కానీ వచ్చాను. విన్నాను. అంటే ఇది శివ సంకల్పం అయివుండాలి. అయ్యా ఎలా గత జన్మల చర్చ విన్నాము. మట్టిలో ఓ ఏనుగు బొమ్మ చేస్తాం. ఆనందిస్తాం, ఆ తరవాత ఆ మట్టిని తడిపి పులిబొమ్మ చేస్తాం. ఇప్పుడు ఆ పులిబొమ్మలోఏనుగు లక్షణాలుగానీ, రూపు రేకలు గానీ ఉంటాయా? మళ్ళీ ఆ పులిని ఓ గద్దలా మలచండి. ఆ గద్దలో ఏనుగు లక్షణాలు  గానీ పులి లక్షణాలు గానీ ఉంటాయా? అలాగే, శరీరాల ప్రకారం చూస్తే మాలదూ మట్టితో తయారైనవి. ఒకేసారి కాదు. ఒకదానిలోంచి మరొకటి. రూపాలు వేరు. నామాలు వేరు. రూపనామాలకు మూలమైన మట్టి మాత్రం ఒక్కటే. అలాగే ఎన్నిసార్లు జన్మలు తీసుకున్నా రూపనామాలు మారతాయిగానీ వాటికి ఆధారభూతమైన ఆత్మ మారదు. ఆత్మ బుద్ధి మనసు జ్ఞానం ఇవన్నీ ఒకేదాని వివిధ కోణాలన్నారు కదా! ఈ క్షిప్రా నది బహు రహస్యమైనది. దీని క్రింద ఉన్న రహస్యాలని మానవ మేధస్సు ఛేదించలేదు. ఓ సమయం వస్తుంది.  అప్పుడు.. అప్పుడు భూమిని ఎలక ఛేదించినట్టు ఛేదిస్తూ ఆ రహస్యం బైటపడుతుంది. మొన్నక మాడు రావల్సింది. కానీ కాలం అనుమతించలేదు. ఓయీ.. ఇప్పుడు జరుగుతున్న దారుణాలు పసి మొక్కల్లాంటివి. రాబోయేవి మహా వృక్షాలు. ఒక్కటి నిజం... మీరు సంపూర్ణ సంకల్పంతో తపస్సు ప్రారంభించండి. తపస్సు అంటే నిరంతర శుభ సంకల్ప సంధానమే. గతం వైపు దృష్టి సారించకండి" అన్నాడుత్రిశూలధారి.

"మీరూ?"వినయంగా అన్నాడు అరిదమనుడు.

"నేను మీలాంటి వాడినే. నేను ఎవరూ? అప్పుడు ఎవరూ,ఇప్పుడు ఎవరూ అనే సందేహంతో కొట్టుమిట్టాడుతున్నవాడినే. ఎందుకిలా వచ్చాను. విన్నాను. నేను మాట్లాడింది ఏదీ నేను మనసులో నిర్ణయించుకుని మాట్లాడింది కాదు. అసలెందుకు మాట్లాడానో నాకే తెలీదు. బహుశా ఇదీ ఓ జన్మ సంబంధమే కావొచ్చు. నేను వెళ్ళాలి.

వెళ్ళాలనే నిర్ణయమూ నాదికాదు. నా మనసు బయలుదేరమని తొందరపెడుతోంది. సెలవు.. ఓ నమఃశివాయ" అంటూ నడిచిపోయాడు త్రిశూలధారి.

అవాక్కై కూర్చున్నారు అలంబస అరిదమనులు. క్షిప్రానది నిశబ్ధంగా ప్రవహించిపోతోంది.

"అవును.. ఎవరికి తెలుసూ, యీ నదీ గర్భంలో ఎన్ని రహస్యాలున్నాయో" నిట్టూర్చి అంటూ లేచాడు అరిదమనుడు. తనూ లేచాడు అలంబసుడు.

### తక్షపురం

శృంగి నిలబడి ఉన్నాడు. తక్ష మండపం ప్రశాంతంగా ఉంది. 18 నాగమూర్తుల నయనాలు ప్రశాంతంగా ఉన్నాయి. అన్నింటికంటే మించి చేతుల్ని పాము పడగల్లా తిప్పుతూ భయపెట్టే ముసల్ది ప్రశాంత వదనంతో ఉంది. "ఆవిడ రాత్రివేళ తక్షాలయానికి వచ్చింది.

"ఏమిరా.. ఇక్కడెందుకు నీ సమయాన్ని వృధా చేసుకుంటావూ? రౌద్రంగా బుసలు కొడుతూ లోకాన్ని తన విషంతో మండించగల తక్షకుడు మౌనంగా ప్రసన్నంగా ఉన్నాడు. మీరందరూ ఎదురు చూస్తున్నారుగా ప్రళయం కోసం. నాకెలా తెలిసిందనా? తెలుసు. మరణ కాండ జరుగుతుంది. బీజమూ పడింది. కొందరు ఇప్పటికీ పుట్టారు. కొందరు పుట్టాలి. దుర్మార్గులుగా, దుష్టులుగా పైకి కనిపిస్తూ క్షుద్ర రచనకీ, క్షుద్రమైన పనులకూ దూరంగా ఉండే సత్పుర్షులు కొందరైతే, పరమ పవిత్రులుగా కనిపిస్తూ శాస్త్ర నియమాలు పాటిస్తూ ధ్వంస రచన చేసే క్షుద్రులు ఇంకొందరు. వీరూ వారూ కూడా పుట్టారు. పుడుతున్నారు. పుట్టబోతున్నారు. మనిషి ఆయుష్షు మళ్ళీ మారుతోంది. నూట యాభై సంవత్సరాలకు పైగా జీవిస్తాడు. అయితే ఆ జీవితం అంతా సంగ్రామాలతో సంక్షోభాలతో గడుస్తూంది. యుగయుగాల వైరం మళ్ళీ ప్రజ్వరిల్లుతుంది. ఎవరు ఎవర్ని చంపుతున్నారో ఎందుకు చంపుతున్నారో కూడా తెలియకుండా మనుషులు తమని తామే చంపుకుంటారు. అదీ శారీరక బలాలతోకాదు. యాంత్రిక శక్తులతో, తాంత్రిక శక్తి విశృంఖలంగా పెరుగుతుంది. దైవారాధన పోయి పిశాచాల్ని ఆరాధిస్తారు. ఆవహింపజేసుకుంటారు. నాయకుడికంటే వెయ్యిరెట్లు ప్రతి నాయకుడ్ని ప్రజలు అనుసరిస్తూ దుష్ట మార్గాల వెంట పయనిస్తారు. మీరు వెతుకుతున్నారుగదా.. మహాభారత కాలపు ఆయుధాలు, శస్త్రాలనీ! అన్నీ భద్రంగా ఉన్నాయి. వాటిని ఒక చోట చేర్చు. ఆ చోటు మీదగా ఓ నదిని మళ్ళించాడు అశ్వద్ధామ. అతడు చిరంజీవి కదా! అందుకే అతని సంకల్పాను సారం అవి ఇప్పుడు బయట పడవు. కానీ, అప్పటివారు ఇప్పుడు పుట్టి తమ ఆయుధాలని తామే చిక్కించుకుంటారు. అయితే అదిలోహ రూపంలో కాదు. మేధో రూపంలో!" మెల్లగా ప్రశాంతంగా చెప్పింది ముసలిది.

"మరీ" అడగబోయాడు శృంగి.

"ముందు నీ గురువు దగ్గరకి నువ్వు పో" లేచి నిలబడింది ముసలిది.

(సమాప్తం)

Post your comments